www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 సెప్టెంబరు 2024
5
ఏలూరు



వంద పడకల ఆస్పత్రి 2025 నాటికి పూర్తి

ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

చింతలపూడి : స్థానికంగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణం 2025 నాటికి పూర్తి చేయాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చింతలపూడి ఏరియా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌తోపాటు కమిటీ వైస్ ఛైర్మన్ కొండ్రు దేవా, సభ్యులు భారతి, డిసిహెచ్‌ఎస్ పి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రి మరమ్మతులు నవంబర్ ఒకటో తేదీనాటికి పూర్తి చేయాలన్నారు. హాస్పిటల్‌లో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో ముఖ్యమంత్రిని కలవనున్నామని, వంద పడకల ఆసుపత్రి ప్రణాళిక వివరాలు అందించాలని ఆదేశించారు. అంబులెన్ సమస్య పరిష్కరించాలన్నారు.

సీలింగ్ భూములకు

పంట రుణాలు నిలిపివేత

- సహకార సంఘాల్లో రైతులకు ఎదురుదెబ్బ
- 30 ఏళ్లుగా ఇస్తున్న పంట రుణాల నిలిపివేతపై రైతుల ఆగ్రహం
- రెండు జిల్లాల్లో వేలాది మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- సీలింగ్ భూములున్న రైతులంతా పేద దళితులు, బిసిలే
- సొంతభూమి, పట్టా ఉన్నా పంట రుణం ఇవ్వకపోవడంపై విస్మయం
- ఎంఎల్‌ఎలు, జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవాలని రైతుల వేడుకోలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సీలింగ్ భూముల రైతులకు సహకార సంఘాల్లో పంటరుణాల మంజూరును నిలిపివేయడం రెండు జిల్లాల్లో సర్వత్రా చర్చనీయాంశమైంది. కౌలురైతులకు బ్యాంకుల నుంచి పంటరుణాలు మంజూరు చేయాలని ఆందోళనలు జరుగుతున్న క్రమంలో పట్టాలున్న సీలింగ్ భూములకు పంటరుణాలు నిలిపివేత అత్యంత దారుణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంటరుణాలు ఇవ్వకపోగా.. గతంలో ఇచ్చిన రుణాలు వెంటనే చెల్లించాలంటూ రైతులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తుండటంపై రైతులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. సీలింగ్ భూములున్న రైతులంతా ఎస్‌సి, బిసి సామాజిక తరగతులకు చెందినవారే. డిసిసిబి పరిధిలో ఏలూరు జిల్లాలో 159, పశ్చిమగోదావరి జిల్లాలో 122 మొత్తం 281 సహకార సంఘాలు ఉన్నాయి. సహకార సంఘాల ద్వారా జిల్లా రైతాంగానికి ప్రతియేటా పెద్దఎత్తున పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వం పేదలకు సీలింగ్ భూములిచ్చి దాదాపు 35 ఏళ్లకుపైగా గడిచిపోయింది. అప్పటి నుంచి సీలింగ్ భూములకు సహకార సంఘాల్లో పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా సీలింగ్ భూములకు పంటరుణాలు నిలిపివేస్తూ సాగుచేసే రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకూ సమంజసమో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో మార్చిలోనే ఈ పరిస్థితి ఏర్పడిందని, కొత్త ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం అప్పట్లో పేద కుటుంబాలకు చెందిన దళిత, బిసి సామాజిక తరగతులకు అరెకరం చొప్పున సీలింగ్ భూములను పంపిణీ చేసింది. ఆ భూములకు క్రాప్‌లోన్ కింద రూ.25 వేలు వరకూ సహకార సంఘాలు ఇస్తున్నాయి. పంటరుణం అనేది సాగుచేసే పంట ఆధారంగా ఇస్తారు. ప్రతియేటా మార్చిలో తీసుకున్న రుణం చెల్లించడం, కొత్తరుణం తీసుకోవడం పరిపాటిగా సాగుతోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీలింగ్ భూములకు సంబంధించిన మార్టిగేజ్ (తనఖా ప్రక్రియ) జరగకపోవడం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని సహకార సంఘాల అధికారులు చెబుతున్నారు. ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తే తప్ప రైతులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు.

పంట రుణం ఇవ్వకపోతే సాగు చేసేదెలా..

సొంత భూమి ఉండి, ఆ, భూమికి పట్టా ఉన్నా రకరకాల కారణాలతో సీలింగ్ భూములకు పంటరుణాలు నిలిపివేస్తే రైతులు పెట్టుబడి కోసం ఏం చేయాలనే ప్రశ్నకు ఏ ఒక్కరి వద్దా సమాధానం లేకుండాపోయింది. సహకార సంఘాల్లో పంట రుణాలను నిలిపివేయడంతో సీలింగ్ భూముల రైతులు రుణాల కోసం నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో సహకార సంఘాల జనరల్‌బాడీలో రైతులు అధికారులను నిలదీస్తున్న పరిస్థితి సైతం నెలకొంది. సీలింగ్ భూముల రైతులకు సహకార సంఘాల్లో వెంటనే పంట రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

30 ఏళ్ల నుంచి ఇస్తూ హఠాత్తుగా పంట రుణం ఆపేశారు

పిట్టా వెంకటేష్, దళిత రైతు, అడవికొలను, నిడమర్రు మండలం

ప్రభుత్వం మా కుటుంబానికి అరెకర భూమి సీలింగ్ కింద ఇచ్చింది. అడవికొలను సహకార సంఘంలో గడిచిన 30 ఏళ్లుగా పంటరుణం తీసుకుంటున్నాం. ఈ ఏడాది మార్చిలో పంటరుణం ఆపేశారు. జనరల్‌బాడీలోనూ దీన్ని లేవనెత్తాం. పైస్థాయికి పంపుతామని చెప్పారు. హఠాత్తుగా పంటరుణం నిలిపివేస్తే సాగు ఎలా చేయాలి. ప్రభుత్వం వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

బకాయిలు చెల్లించినా రుణాలు ఇవ్వకపోవడం ఏమిటీ

పీతల దానియేలు, రైతు, అడవికొలను

ప్రతియేటా పంట రుణం తీసుకోవడం సకాలంలో చెల్లించడం చేస్తున్నాం. మాకిచ్చిన అరెకర సీలింగ్ భూమికి అడవికొలను సహకార సంఘంలో 30 ఏళ్లుగా పంటరుణం తీసుకుంటున్నాం. ఇప్పుడు ఉన్నట్టుగా పంటరుణాలు నిలిపివేస్తే వ్యవసాయం ఏవిధంగా చేయాలి. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలి.

రిజిస్ట్రార్ కార్యాలయంలో డిక్లరేషన్ కాకపోవడంతోనే సమస్య

నారా తిలక్, సిఇఒ, డిసిసిబి

సహకార సంఘాల్లో సీలింగ్ భూముల రుణాల మంజూరు సమస్య నా దృష్టికి వచ్చింది. రిజిస్ట్రార్ కార్యాలయంలో సీలింగ్ భూములకు సంబంధించి మార్టిగేజ్ కావడం లేదు. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం రిజిస్ట్రార్ కార్యాలయంలో డిక్లరేషన్ కాకుండా పంట రుణం ఇవ్వడం సాధ్యం కాదు. జిల్లాలో పెద్దసంఖ్యలోనూ సీలింగ్ భూముల రైతులు ఉన్నారు. గతంలో ఇచ్చిన మార్టిగేజ్ 12 ఏళ్ల దాటకపోతే రుణాలిస్తున్నాం. దాటితే మాత్రం మళ్లీ చేయించాల్సి ఉండటంతో అది పూర్తికాక సమస్య ఏర్పడింది. ఆప్కాబ్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం.

జెడ్‌పి ఛైర్‌పర్సన్‌ను అనర్హురాలిగా ప్రకటించండి

సిఇఒకు 30 మంది వైసిపి జెడ్‌పిటిసిల వినతి



సిఇఒకు వినతి అందిస్తున్న జెడ్‌పిటిసిలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీని ఆ పదవికి అనర్హురాలిగా ప్రకటించాలని వైసిపికి చెందిన 30 మంది జెడ్‌పిటిసిలు శనివారం జిల్లా పరిషత్ సిఇఒ కెఎస్‌-ఎస్.సుబ్బారావుకు వినతిపత్రం ఇవ్వడం జిల్లా రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైసిపి జెడ్‌పిటిసిలు మొత్తం 45 మంది కలిసి 2023 జూన్ ఎనిమిదో తేదీన తమ పార్టీ విప్‌ను అనుసరించి తమలో ఒకరైన గంటా పద్మశ్రీని జెడ్‌పి ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నామని ఆ వినతిలో పేర్కొన్నారు. ప్రస్తుతం పద్మశ్రీ వైసిపి విప్‌ను ధిక్కరించి పార్టీకి రాజీనామా చేసి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారని, ఆమె ఆ పదవిలో ఉండటానికి అనర్హురాలని పేర్కొన్నారు. ప్రస్తుతం గంటా పద్మశ్రీ వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరి పార్టీ విప్‌ను ధిక్కరించినందున ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్‌చట్టం 1994 సెక్షన్ 181(1) ప్రొవిజన్ అనుసరించి ఆమెను ఛైర్‌పర్సన్ పదవి నుండి అనర్హురాలిగా ప్రకటించాలని కోరారు. జిల్లా పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రంపై 30 మంది జెడ్‌పిటిసిలు సంతకాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 సెక్షన్ 181(7) ప్రకారం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఎన్నిక జరపాలని కోరారు.

అనర్హులిగా ప్రకటించే అవకాశం ఉందా..!

2021లో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో మొత్తం 48 స్థానాలకుగాను 46 చోట్ల వైసిపి గెలుపొందింది. దీంతో జెడ్‌పి ఛైర్‌పర్సన్ పీఠం వైసిపి కైవసం చేసుకుంది. బిసి సామాజిక తరగతికి చెందిన కౌరు శ్రీనివాసులు జెడ్‌పి ఛైర్మన్‌గా 2021 సెప్టెంబర్ 16న ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో శ్రీనివాస్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలోకి దిగి గెలుపొందారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పీఠం ఖాళీ అయ్యింది. ఈ క్రమంలో పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా వైసిపి ఎంపిక చేయడంతో 2023 జూన్ 8న ఆమె బాధ్యతలు స్వీకరించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించింది. దీంతో జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. కొద్దిరోజుల ముందు గంటా పద్మశ్రీ, ఆమె భర్త ప్రసాద్ టిడిపిలో చేరారు. ఈ క్రమంలో వైసిపికి చెందిన జెడ్‌పిటిసిలు 30 మంది ఆమెను జెడ్‌పి ఛైర్‌పర్సన్ పదవికి అనర్హురాలిగా ప్రకటించాలని సిఇఒను కోరారు. దీనిపై సిఇఒ సుబ్బారావును వివరణ కోరగా వైసిపి జెడ్‌పిటిసి ఛైర్‌పర్సన్‌ను అనర్హురాలిగా ప్రకటించాలని వినతిపత్రం ఇచ్చిన మాట వాస్తవమేనని, అయితే నిబంధనల ప్రకారం వారు ఆ వినతి జిల్లా కలెక్టర్‌కు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. పదవి చేపట్టి నాలుగు సంవత్సరాలు గడిస్తే తప్ప అవిశ్వాస తీర్మానానికి కూడా అవకాశం ఉండదని ఆయన చెప్పారు.

కార్మికులు మత రాజకీయాలను తిప్పికొట్టాలి

సిఐటియు జిల్లా సదస్సులో ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న మత రాజకీయాల పట్ల కార్మిక వర్గం అప్రమత్తంగా ఉండి చైతన్యవంతంగా వాటిని తిప్పికొట్టాలని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మానవత కళ్యాణ మండపంలో సిఐటియు జిల్లా సదస్సును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీతారాం ఏచూరి తన జీవితాన్ని సమస్త శ్రామిక వర్గానికి, సమాన అవకాశాల కోసం పోరాడారని, ఆయన ఆశయాలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక, సామ్యవాద, ప్రజాతంత్ర పరిపాలన కోసం, కార్మికవర్గ విముక్తి కోసం చట్టసభల్లో సైతం పోరాడారని కొనియాడారు. ఒకపక్క మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, మరోపక్క ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దోచిపెడుతున్న ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన చంద్రబాబు కూటమి అధికారంలోకి వచ్చాక, మత రాజకీయాలతో ప్రజలను విడదీసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ కూటమి కార్మిక వ్యతిరేక విధానాలను వేగవంతం చేస్తోందని విమర్శించారు. నేటికీ రాష్ట్రంలో కనీస వేతనాల చట్ట సవరణ జరగలేదని, ఢిల్లీ తరహాలో కనీస వేతనాల చట్టాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ అమలు చేసేందుకు ఎన్‌డిఎ ప్రయత్నిస్తుందని, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా కార్మిక వర్గానిదేనని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వ సమయంలో పోరాడి సాధించుకున్న హామీలను అమలుపర్చేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మికులపై రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని, దానిని కార్మికదవర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సదస్సు ప్రారంభానికి ముందు సిఐటియు పతాకాన్ని జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ఆవిష్కరించగా, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. జిల్లాలో నాలుగు లక్షల మంది కార్మికులు ఉన్నారని, వారందరి సమస్యలపై సిఐటియు అనేక సమరశీల పోరాటాల నిర్వహిస్తోందని తెలిపారు. కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సిఐటియు జిల్లా ఆఫీసు బేరర్స్ ఎస్‌కె.సుభాషిణి, కె.విజయలక్ష్మి, ఎం.నాగమణి, ఎం.రమణారావు, ఎం.దుర్గారావు, భారతి నాయకత్వం వహించగా జిల్లావ్యాప్తంగా 27 మండలాల నుండి దాదాపు 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు.



కేక్ కట్ చేస్తున్న మేయర్ నూర్జహాన్‌పెదబాబు

ఘనంగా మేయర్ పుట్టినరోజు వేడుక

ఏలూరు సిటీ : ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పుట్టినరోజు వేడుకలు పవర్‌పేటలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలపర్రు టోల్‌గేట్ సమీపంలో ఉన్న అనాథాశ్రమంలోని పిల్లలు 30 మందికి దుప్పట్లు అందించి భోజనాలు ఏర్పాటు చేశారు. ఏలూరులోని నాలుగు అన్న కాంటీన్లకు వచ్చిన వారికి టిఫిన్, భోజనం ఉచితంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, జనసేన నాయకుడు రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కైకరం విద్యార్థులు

ఉంగుటూరు :రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అండర్‌-14, 17 బాల బాలికల విభాగాల్లో ఫ్రీస్టేజ్, బ్యాక్ స్ట్రోక్, బటర్ఫ్లై అంశాల్లో ఎస్.సత్య, సిహెచ్.సాయి, ఆర్.భరత్, పి.జస్వంత్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు తెలిపారు.

నూజివీడును సుందరీకరిస్తాం: మంత్రి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణాన్ని సుందరీకరణలో మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతానని మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. పట్టణంలో వీధుల పరిశుభ్రత కోసం రూ.32 లక్షలతో కొనుగోలు చేసిన ఏస్ కంపెనీ క్రేన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో మంత్రి సమీక్షించారు. పట్టణంలో శానిటేషన్ వర్కర్లు ఎంతమంది ఉన్నారు, ఎన్ని ట్రాక్టర్లు, ఎన్ని వాహనాలు ఉన్నాయి, తాత్కాలిక పద్ధతిలో ఎన్ని వాహనాలు, ప్రభుత్వ వాహనాలు ఎన్ని ఉన్నాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ప్రతిరోజూ పారిశుధ్య పనులను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా ఉదయమే పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయాలన్నారు. దోమల నిర్మూలనకు ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని సరిచేసుకుని నిబద్ధతతో పని చేయాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.



క్రేన్ ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారధి

కలెక్టరేట్‌లో కలెక్టర్ తనిఖీలు

ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి: వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్లను, ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో కలెక్టరేట్ ఉద్యోగుల విధులకు సంబంధించిన అంశాలను ఆయా సెక్షన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. పక్కాగా రికార్డులను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్టాబ్లిష్‌మెంట్, ల్యాండ్ అండ్ రెవెన్యూ, ప్రొటోకాల్ ఎన్నికలు, కోఆర్డినేషన్, తదితర విభాగాలను పరిశీలించారు. ఆయా సెక్షన్ల పరిశీలన సమయంలో అక్కడున్న ఉద్యోగులను సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రికార్డ్ రూములను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రికార్డు రూమును నిర్వహించాలన్నారు. తాగునీటి సరఫరా, వాష్ రూమ్‌ల నిర్వహణా తీరును ఆరా తీశారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని డ్వామా ఆఫీస్ పక్కనే ఉన్న సత్యసాయి వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్ ఎఒ రూమ్ ఎదురుగా ఉన్న వాటర్ ఫిల్టర్‌ను కూడ వెంటనే మరమ్మతు చేయించి అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టరేట్లోని క్యాంటీన్‌ను ఆమె పరిశీలించారు. కలెక్టరేట్, కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఒ డి.పుష్పమణి, ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిసిఒ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, మున్సిపల్ కమిషనర్ ఎన్.భానుప్రతాప్ ఉన్నారు.

ఎల్‌టిఆర్ కేసుల్లో ఎస్‌డిసి తీర్పు అంతిమం కాదు

అభ్యంతరాలుంటే పైకోర్టుకు అప్పీల్ చేయొచ్చు
కెఆర్‌పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్
'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎల్‌టిఆర్ (ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్) భూములకు సంబంధించిన కేసుల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డిసి) తీర్పులే అంతిమం కాదని, ఎవరైనా సదరు తీర్పును అంగీకరించనిచో పైకోర్టులో అప్పీల్ చేయవచ్చునని కెఆర్‌పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్ తెలిపారు. ఈ నెల 24న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'డబ్బులు కొట్టు.. జడ్జిమెంట్ పట్టు' కథనంపై ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. ప్రతి ఎల్‌టిఆర్ కేసులోనూ ఆధారాలు పూర్తిగా పరిశీలించిన మీదటే నిష్పక్షపాతంగా ఎటువంటి భయం, పక్షపాతం లేకుండా, ఒత్తిళ్లకు లొంగకుండా ఒక న్యాయాధిపతి పాత్రలో తీర్పులు ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, గిరిజన సక్షేమం వారిచ్చిన తీర్పులపై అప్పీల్‌కు వెళ్తే పైకోర్టు విచారణ చేస్తుందని తెలిపారు. ఈ వెసులుబాటు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ప్రాంత భూ బదలాయింపు చట్టం 1959, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ప్రాంత భూ బదలాయింపు రూల్స్ 1969లో ఉన్నాయని తెలిపారు. పత్రికలో వచ్చిన సదరు వార్తలోని అంశాలను ఖండిస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్ తన వివరణలో తెలిపారు.

పోరాట యోధుడు భగత్‌సింగ్

జయంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - చింతలపూడి

బ్రిటిష్ వారి చెర నుంచి భారత దేశ విముక్తి కోసం పోరాడిన భగత్‌సింగ్ అతి చిన్న వయసులోనే ఉరికంబం ఎక్కారని సిఐటియు సీనియర్ నాయకులు ఎస్.సూర్యకుమార్ అన్నారు. స్వాతంత్రోద్యమకారులు భగత్‌సింగ్ 117వ జయంతి సందర్భంగా చింతలపూడి ప్రయివేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో చింతలపూడి బోసు బొమ్మ సెంటర్‌లో భగత్ సింగ్ జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి యూనియన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్కూల్ బస్సు యూనియన్ నాయకులు ఎ.మధు, ఎం.రవి, పి.నాగు, భాష, సర్వేశ్వరరావు, వెంకట్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశంలో నిరుద్యోగ సమస్యపై పోరాడాలని ఎఐవైఎఫ్ జిల్లా కో-కన్వీనర్ తొర్లపాటి రాజు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

చాట్రాయి : తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో భగత్‌సింగ్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు మాట్లాడారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు.

నూజివీడు టౌన్ : పట్టణంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పెద్దఎత్తున తరలి వచ్చి ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



చింతలపూడిలో...

కీచక ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుసరాజుపల్లి గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థినిని వేధించిన టీచర్‌ను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక జూనియర్ కళాశాల నుంచి నెహ్రూ బొమ్మ కూడలి, బస్టాండ్ వరకు విద్యార్థులతో శనివారం భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెఎసి జిల్లా అధ్యక్షులు కుర్సం దుర్గారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, ఇప్టు జిల్లా ఉపాధ్యక్షులు సరియం రామ్మోహన్ మాట్లాడుతూ కీచక ఉపాధ్యాయుడు జక్కుల మురలీకృష్ణను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ పాయం రమేష్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కారం భాస్కర్, ఎఎస్‌పి మండలాధ్యక్షుడు రవ్వ బసవరాజు, డివిజన్ కార్యదర్శి లక్ష్మణ్, విద్యార్థి జిల్లా కార్యదర్శి తెల్లం శ్రీనివాసరావు, పిడిఎస్‌యు నాయకులు బన్నే వినోద్, ఆదివాసీ కొండ రెడ్ల సంఘం జిల్లా అధ్యక్షులు పట్ల రమేష్ రెడ్డి పుసం శ్రీను, జెఎసి జిల్లా కార్యదర్శి సోదేం ముక్కయ్య, జీలుగుమిల్లి మండల నాయకులు రాజేంద్ర, పండు నాగేంద్ర, నవీన్ పాల్గొన్నారు.

కేసులను దాఖలు చేసే ప్రక్రియపై శిక్షణ

ఏలూరు అర్బన్ : రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి జడ్జి పి.మంగాకుమారి శనివారం న్యాయ సేవాధికార సంస్థ భవనంలో న్యాయవాదులకు, న్యాయవాద గుమస్తాలకు ఆన్‌లైన్ విధానం ద్వారా కేసులను దాఖలు చేసే ప్రక్రియ పైన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగాకుమారి మాట్లాడుతూ కక్షిదారులకు మరింత వేగవంతమైన, నాణ్యమైన న్యాయ సేవలందించడం కోసం ఆన్‌లైన్ విధానం ద్వారా కేసులను దాఖలు చేసుకోవడానికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా కక్షిదారులకు న్యాయ సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బుల్లికృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొనే సీతారామ్, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

ఆకాంక్షలేనా..!



రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులైంది. కూటమి ఘనంగా ఇది మంచి ప్రభుత్వం పేరిట హడావుడి చేస్తోంది. పెన్షన్ సొమ్ము పెంపు హామీ అమలవ్వగా మిగిలిన సూపర్ సిక్స్ హామీల అమలు గురించి జనం ఎదురుచూస్తున్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ అమలు చేస్తామని ప్రకటించడం జనానికి కొంత ఊరటనిచ్చింది. ఇదే సమయంలో జనంతోపాటు కూటమి నేతలు సైతం నామినేటెడ్ పదవుల గురించి ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో టిడిపికి చెందిన ముగ్గురికి నామినేటెడ్ పదవులు దక్కగా జనసేన నుంచి ఎవరికీ దక్కకపోవడం చర్చనీయాంశమైంది. దీంతో రెండో జాబితా ఎప్పుడొస్తుందా అని అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రకటించిన మూడు పదవులు డెల్టా, ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలకు కేటాయించినట్లుగా కన్పిస్తోంది. ఏజెన్సీ నుంచి ఎపి ట్రైకార్ ఛైర్మన్‌గా బొరగం శ్రీనివాసులు పదవి దక్కించుకోవడం పోలవరం నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహానిచ్చిందనే చెప్పొచ్చు. ముందుగా ప్రకటించినట్లు ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ నుంచి తప్పుకున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజుకు ఎపిఐఐసి పదవి కట్టబెట్టి సముచిత స్థానం కల్పించారు. అదే సమయంలో వీరవాసరానికి చెందిన మాజీ మంత్రి పీతల సుజాత గత ఎన్నికల్లోనూ చింతలపూడి టిక్కెట్ ఆశించారు. 2014 ఎన్నికల్లో చింతలపూడి నుంచి టిడిపి తరఫున గెలుపొంది మంత్రి పదవి చేపట్టిన సుజాత ఎంపీ మాగంటిబాబు తదితరులతో విబేధాల నేపథ్యంలో అర్థాంతరంగా మంత్రి పదవి కోల్పోయారు. అయినప్పటికీ ఆమె పార్టీని వీడకుండా 2019, 2024 ఎన్నికల్లోనూ చింతలపూడి టిక్కెట్ ఆశించినా దక్కలేదు. అయినా గత ఎన్నికల్లో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి ఛైర్‌పర్సన్ పదవి దక్కింది. ఇంకా టిడిపిలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న జాబితా చాంతడంతా ఉంది. అందులో జిల్లాస్థాయి ముఖ్యనాయకులు ఉండటం విశేషం. అదే సమయంలో జనసేన నుంచి కూడా నామినేటెడ్ పదవుల ఆశావహులు పెద్దసంఖ్యలోనే ఉన్నారు. ప్రధానంగా టిడిపి గెలుపొందిన స్థానాల్లో పోటీ నుంచి తప్పుకున్న వారు, ఇతర నేతలు పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే కార్యాచరణలో వీరిలో ఎంతమందికి పదవులు దక్కుతాయనేది అనుమానమే. ఈ క్రమంలోనే వైసిపి నుంచి కొంతమందిని జనసేనలోకి చేర్చుకోవడాన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. నామినేటెడ్ పదవులు దక్కకపోయినా స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దిగి పదవులు దక్కించాలనుకుంటే ఆ పదవుల్లో ఉన్నవారు తమ పార్టీలోకి చేరాక ఆ పదవులు వదులుకుంటారా అని ఆ పార్టీ దిగువస్థాయి నేతలు ప్రశ్నిస్తుండటం గమనార్హం. ఏదేమైనా నామినేటెడ్ పదవుల పందేరం కూటమిలోని తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణుల్లో ఒకింత ఉత్సాహం, మరికొంత నిస్తేజం కల్గిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఇక నూజివీడులోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ట్రిపుల్ ఐటీలో పరిస్థితులు ఎప్పుడు చక్కదిద్దుకుంటాయోనని అక్కడి విద్యార్థులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ట్రిపుల్ ఐటీలో చేరిన విద్యార్థులు చదువుకన్నా తమ ఆరోగ్యం కోసం తపన పడాల్సి రావడం, అర్థాకలితో అలమటించాల్సి రావడం నిజంగా బాధాకరమే. ఇప్పటికీ అక్కడ మెస్‌ల్లో పరిస్థితులు మారకపోవడం వ్యవస్థీకృత లోపానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మెస్ కాంట్రాక్టర్‌ను తక్షణం మార్చాలని కొత్తగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అమరేంద్రరావుకు మంత్రి పార్థసారధి ఇచ్చిన ఆదేశాలు ఏమేరకు అమలవుతాయో, విద్యార్థుల ఇబ్బందులు ఎప్పటికి గట్టెక్కుతాయో వేచిచూడాలి.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ముదినేపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

నిత్యం ఏదో సమయంలో దంచికొడుతున్న వానలతో మండల ప్రజానీకం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజు మండలవ్యాప్తంగా వర్షాలు పడుతూనే ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. వర్షాలతో జాతీయ, రాష్ట్రీయ రహదారులతోపాటు గ్రామాల్లో రోడ్లన్నీ ఛిద్రమై అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై ఏర్పడ్డ భారీ గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలకు పలు గ్రామాల్లో వరి చేలు ముంపులోనే ఉన్నాయి. ప్రధాన డ్రెయిన్లు ఎదురు తన్నడంతో దిగువకు నీరు పారడం లేదు. నిత్యం ఏదో సమయంలో కురుస్తున్న వర్షాలతో పనులు లేక గ్రామీణ ప్రాంత ప్రజలు, చేలల్లోని ముంపు నీరు తగ్గక రైతన్నలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నూజివీడు ఆర్‌జియుకెటిలో వర్క్‌షాపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న రాజీవ్ గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయంలో సివిల్ డిపార్ట్‌మెంట్ సారథ్యంలో పలు అంశాలపై శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ అరవింద్ ఉమామహేశ్వర్ హాజరయ్యారు. ఆయన యుఎస్ఎలోని వోర్సెస్టర్ పాలిటెక్నిక్ ఇన్స్టిట్యూట్, వోర్సెస్టర్‌లో సివిల్ ఇంజినీరింగ్‌లో పిహెచ్‌డి చేశారు. ప్రస్తుతం ఆయన అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆర్‌జియుకెటి నూజివీడు డైరెక్టర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సాండ్ర వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా రజిత

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి సబ్ రిజిస్ట్రారుగా సిహెచ్.రజిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రజిత మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బదిలీపై ముదినేపల్లి వచ్చారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎస్.మధుబాబు కృష్ణాజిల్లా కొత్తవరం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బదిలీపై వచ్చిన రజితను కార్యాలయ సిబ్బంది, దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు ఘనంగా సన్మానించారు.



సిహెచ్.రజిత

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచించారు. మండలంలోని గుండుగొలనుకుంట గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వనరుల, శిక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ప్రకృతి వనరుల కేంద్రంలో ఏపిసిఎన్ఎఫ్ ప్రోగ్రాం కింద ప్రకృతి సేద్యంలో భాగంగా కషాయాలు, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని పరిశీలించారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు సిక్ కాలపు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసి ఉద్యోగులకు సిక్ కాలానికి సంబంధించిన జీతాలు చెల్లించాలని సిపిఎం శాఖా మహాసభ డిమాండ్ చేసింది. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎం.అరుణ కుమారి అధ్యక్షతన శాఖా మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సభలో అరుణ కుమారి మాట్లాడుతూ ఆర్‌టిసిలో పని చేస్తున్న ఉద్యోగులు అనారోగ్యం కారణంగా సిక్ అయితే ఆ సిక్ కాలానికి సంబంధించి జీతాలు అందడంలేదన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అలాగే సంస్థలో అన్ని విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని, వెంటనే సిబ్బంది న్యూ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కుక్కునూరు : కుక్కునూరు మండలంలో పోలవరం నిర్వాసితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనసేన మండలాధ్యక్షులు ములిశెట్టి యుగంధర్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చిర్రి బాలరాజు స్పందిస్తూ ఇటీవల సిఎం చంద్రబాబును కలిసి నిర్వాసితుల పరిహారం, సమస్యలను, నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం పెట్టాలి

ఉంగుటూరు : విద్యార్థులకు మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంపిడిఒ రాజ్ మనోజ్ అన్నారు. నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల భోజనాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఏజెన్సీ నిర్వాహకులకు ఆయన పలు సూచనలిచ్చారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

చింతలపూడి : కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వెళ్తారని చింతలపూడి ఎంఇఒ-2 కిరణ్‌బాబు అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెంలో రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ ఇతర సబ్జెక్టులపై అవగాహన కల్పించారు.

నేరాలు - ఘోరాలు

గుండెపోటుతో విద్యార్థి మృతి

ముసునూరు : గుండెపోటుతో విద్యార్థి మృతి చెందిన ఘటన లోపూడి గ్రామంలో చోటు చేసుకుంది. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లోపూడికి చెందిన పోట్రు నాగముసలయ్య (12) లోపూడి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అతని తల్లిదండ్రుల మధ్య విబేధాలు వచ్చి సుమారు ఏడేళ్ల క్రితం విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. నాగముసలయ్యకు ఒక తమ్ముడు ఉన్నాడు. వీరి తల్లి వెంకమ్మ కూలీ పనులకు వెళ్లి తన ఇద్దరు పిల్లలను చదివించుకుంటుంది. నాగముసలయ్యకు విజయవాడ రమేష్ హాస్పిటల్‌లో ఏడాది క్రితం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేశారు. ఈ క్రమంలో శుక్రవారం పాఠశాలకు వెళ్లిన నాగముసలయ్య సాయంత్రం ఇంటికి వచ్చి రాత్రి భోజనం చేసి నిద్రించాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుండె నొప్పి రావడంతో విజయవాడ రమేష్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతి చెందాడు. బాధిత మహిళ వెంకమ్మను టిడిపి నాయకులు లక్కపాము కాంతారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, పి.వెంకయ్య, పలువురు వ్యక్తులు పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం వచ్చేలా ఆదుకుంటామన్నారు. తాము కూడా ఎంతో కొంత ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్ : 68వ ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాల బాలికల యోగాసన పోటీలు నూజివీడు ట్రిపుల్ ఐటి యోగశాలలో శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పియుసి చదువుతున్న విద్యార్థులు అన్ని స్థానాలను కైవసం చేసుకుని, అన్నమయ్య జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు పి.శివ భాస్కరరావు (సిద్ధార్థ కళాశాల, విజయవాడ) అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-19 సెక్రటరీ రవికాంత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులను నూజివీడు ట్రిపుల్ ఐటి ఎఒ డాక్టర్ లక్ష్మణరావు, పియుసి ఇన్‌ఛార్జి దుర్గాబాబు, యోగా శిక్షకుడు అక్కినేని సత్య శ్రీధర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సాయిరాం

భీమడోలు : భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి పి.సాయిరాం ఏలూరులో నిర్వహించిన అంతర కళాశాలల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు వేల మీటర్ల స్టీపిల్ ఛేజ్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నారని పాఠశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ తెలిపారు. అక్టోబర్ నాలుగో తేదీన రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు సభ్యునిగా పోటీల్లో పాల్గొంటారన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ..

ద్వారకాతిరుమల : ఉంగుటూరు మండలం కైకరం జెడ్‌పి హైస్కూల్‌లో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో ద్వారకాతిరుమల ఆలయం హైస్కూల్ విద్యార్థులు పాల్గొని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. షటిల్ బాడ్మింటన్ అండర్-14 విభాగంలో టి.వంశీ, ఎం.నాగ చైతన్య, వాలీబాల్ అండర్-17 విభాగంలో ఎం.అశోక్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు పిఇటి సురేష్, హెడ్ మాస్టర్ శేషుకుమార్ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తిని కలిశారు. విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ముగిసిన ఆటల పోటీలు

ప్రజాశక్తి - మండవల్లి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. మండల స్థాయి ఆటల పోటీల్లో బాలికలకు కోకో, చెస్, కబడ్డీ, టెన్నికాయిట్, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించి ఎంపిక చేశారు. ఈ ఆటల పోటీల్లో మండవల్లి మండలానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మంచి నైపుణ్యం ప్రదర్శించారు. ఇక్కడ ఆటల్లో ఎంపికైన విద్యార్థులు కైకలూరు నియోజకవర్గ స్థాయిలో ఆరుతెగలపాడులో నిర్వహించే ఆటల పోటీల్లో పాల్గొంటారని పీడీ పెరుమాళ్ల పిఇటి వేణుబాబు తెలిపారు. రెండో రోజు ఆటల పోటీలను మండవల్లి సర్పంచి మెండ ఝాన్సీ ప్రారంభించారు.

తహశీల్దార్ కార్యాలయం మార్పు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు తహశీల్దార్ కార్యాలయాన్ని తాత్కాలికంగా భీమడోలు గ్రామ సచివాలయం-2 కార్యాలయ భవనంలోకి మార్చినట్లు తహశీల్దార్ బి.రమాదేవి తెలిపారు. కార్యాలయ బదిలీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టామన్నారు. ఇకపై లావాదేవీలన్నీ అక్కడి నుంచే కొనసాగుతాయని తహశీల్దార్ తెలిపారు.

పోషకాహార మహోత్సవాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎంతో బలవర్ధకమైన ఆహారం అందుతుందని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అన్నారు. ఉంగుటూరులో సెక్టారు అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పోషకాహార వేడుకలు శనివారం నిర్వహించారు. కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహార వంటకాల స్టాల్స్‌ను ఎంపిపి పరిశీలించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎంపిడిఒ రాజ్‌మనోజ్, సర్పంచి బండారు సింధు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బివి.శ్రీలక్ష్మి, శారదామణి పాల్గొన్నారు.

గడ్డి మందు పిచికారీ

ప్రజాశక్తి - ముసునూరు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గడ్డిని చింతలపల్లి శివారు గోగులంపాడు గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి సిర్రా బాలకృష్ణ ఆర్థిక సాయంతో గడ్డి మందు కొట్టించారు. బాలకృష్ణ అందించిన రూ.ఆరు వేలతో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ నక్క యోహాను, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, గ్రామస్తులు కె.ఉదయ్ కిరణ్, పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వరరావు గడ్డి మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా బాలకృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సునీలరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పలుచోట్ల 'మన ఇల్లు మన గౌరవం'

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో శనివారం నిర్వహించిన మన ఇల్లు మన గౌరవం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఎంపిడిఒ పద్మావతిదేవి తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం స్వచ్ఛత హి సేవ, చెత్త నుంచి సంపద తయారీ, ఆస్తుల సుందరీకరణ, పునర్వినియోగానికి పనికివచ్చే ఇ వ్యర్థాల సేకరణ, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాలను నిర్వహించారు. అంబరుపేట గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచి, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిడిఒ తొలుత మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

టి.నరసాపురం : అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. మండలంలోని పలు పంచాయితీల్లో మన ఇల్లు-మన గౌరవం గ్రామ సభలు నిర్వహించారు.

ముసునూరులో 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరులో పార్టీ మండలాధ్యక్షులు దేవినేని డలరామ్ ఆధ్వర్యంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పరింపూడి గ్రామంలోని జెడ్‌పి హెచ్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని సిరిగిరి నిత్యానందిని ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుంది. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల విద్యార్థులు, సిబ్బంది ఆ విద్యార్థినికి ఆర్థిక సహాయం చేశారు.

ఉత్సాహంగా నియోజకవర్గస్థాయి అథ్లెటిక్ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గ స్థాయి అథెటిక్స్ పోటీలు డిఎఆర్ కాలేజీలో బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివిఎన్.సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పి బాలికల హై స్కూల్ హెచ్‌ఎం వివిఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ హై స్కూల్స్‌లోని క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఒకరికి మించి ఒకరు రెట్టించిన ఉత్సాహంతో పలు క్రీడాంశాల్లో పోటీ పడటం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. మరిన్ని మెరుగైన వసతులు కల్పిస్తే గొప్ప గొప్ప ఫలితాలు చేరువలోనే ఉంటాయన్నారు. నియోజకవర్గస్థాయి క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో ఆడేందుకు అర్హత సాధిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు రాణి, సరళ, నాగరాజు, రవీంద్ర, సుగుణరావు, నాగేశ్వరరావు, వనజ, లక్ష్మి, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, ఆరతి, సుకుమార్, అలీ ఖాన్, హేమ, పుల్లారావు, చిన్నా, శీనివాసరెడ్డి, అన్నామణి, శివనాగేంద్రరావు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం

7, 8 తేదీల్లో బెంగుళూరులో దక్షిణాది రాష్ట్రాల రైతుసంఘాల సమావేశం

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

రైతాంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్ చెప్పారు. శనివారం స్థానిక శ్రీ కృష్ణ యాదవ కళ్యాణ మండపంలో ఎపి రైతుసంఘం రాష్ట్ర స్థాయి కార్యకర్తల శిక్షణా తరగతులు రెండో రోజు శనివారం సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. పలు రైతాంగ సమస్యలను చర్చించారు. ముఖ్యఅతిథి సాగర్ మాట్లాడుతూ దేశంలో జరిగిన రైతాంగ ఉద్యమ చరిత్రను వివరించారు. ప్రస్తుత పాలకులు రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమ ప్రారంభ దినోత్సవ సందర్భంగా నవంబర్ 26న దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ సభ పిలుపునిచ్చిందన్నారు. అక్టోబర్ 7,8 తేదీల్లో బెంగళూరులో దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘాల సమావేశం జరుగుతుందన్నారు. కేరళ తరహాలో కేంద్ర ప్రభుత్వ రైతు రుణ విమోచన చట్టం తీసుకురా వాలని, విత్తన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, జొన్నా శివశంకరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.మోహనరావు, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సీనియర్ నాయకులు గుత్తికొండ కృష్ణారావు మాట్లాడారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

జీలుగుమిల్లి : పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని జంగారెడ్డిగూడెం డివిజన్ పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి మహ్మద్ రజాఉల్ల చెప్పారు. మండలంలోని జీలుగుమిల్లి, ములగలంపల్లిలో జరిగిన గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ఆయా గ్రామాల్లోని ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛతా హి సేవ స్వర్ణాంధ్ర 2047, మన ఇల్లు మన గౌరవం, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువయ్యేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సీమంతలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చిర్రి జగదాంబ, రాజు, జనసేన పార్టీ అధ్యక్షులు రాము, ఎపిఎం రామారావు, పంచాయతీ కార్యదర్శులు అశోక్, ప్రియాంక, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ దేవమ్మ, అంగన్వాడీ యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు ర్యాబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి

ప్రజాశక్తి - భీమడోలు

ర్యాబిస్ లక్షణాలు కనపడగానే వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొంది ఆరోగ్యవంతులుగా మారాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీలత కోరారు. సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ర్యాబిస్ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు ఆనంద్, శ్రీలత, అశ్విని, రశ్మీ, ఆంజనేయులు, కృష్ణచైతన్య మాట్లాడారు.

జీలుగుమిల్లి : పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయి బుచ్చారావు తెలిపారు. ప్రపంచ ర్యాబిస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పశు వైద్య శిబిరాల వద్ద సిబ్బందిచే పెంపుడు కుక్కలకు టీకాల కార్యక్రమం నిర్వహించారు. 60 పెంపుడు కుక్కల వరకు టీకాలు వేసినట్లు తెలిపారు. అనంతరం వెటర్నరీ డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సర్ సిఆర్ రెడ్డి కళాశాల దృశ్య శ్రావణ మందిరంలో ఐక్యూ ఎసి, కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ అవకాశాలు, వృత్తి అభివృద్ధి అంశంపై శనివారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు మాట్లాడుతూ గతంలో ఉన్న ఉపాధి అవకాశాలకు, నేటితరంలో ఉన్న ఉపాధి అవకాశాలకు వ్యత్యాసం గురించి, అదే విధంగా వాటి శిక్షణ గురించి వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ మాట్లాడుతూ వృత్తి రంగంలో ఏ విధంగా నైపుణ్యం సంపాదించాలి, ఏవిధంగా అభివృద్ధి చెందాలనే అంశాల గురించి వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రాంతీయ ఉపాధి అధికారి ఎన్.రామమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులకు డిగ్రీ తర్వాత ఉద్యోగావకాశాల కోసం ఎటువంటి శిక్షణ తీసుకోవాలి, ఏవిధంగా కృషి చేయాలి, ప్రస్తుత కాలంలో ఏరంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా కల్పించబడుతున్నాయో వివరించారు. ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.రాము మాట్లాడుతూ విద్యార్థులు వారి విద్యానైపుణ్యాన్ని ఏ విధంగా పెంపొందించుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషన్, కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ బివిఆర్‌డి.ఫణికుమార్ బికాం తృతీయ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్యామ్‌కు పలువురి అభినందన

నూజివీడు టౌన్ : నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో ఇసిఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పి.శ్యామ్ ట్రెనింగ్, ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్స్, ఇంటెన్షిప్స్, ఇంక్యుబేషన్ డీన్‌గా నియమితులయ్యారు. ఆయన గతంలో నూజివీడు క్యాంపస్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫైనాన్స్ ఆఫీసర్‌గా పని చేశారు. శ్యామ్‌ను డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.లక్ష్మణరావు, క్యాంపస్ అధ్యాపకులు అభినందించారు.

దాతల సహకారంతో బస్‌పాసుల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఆర్‌టిసి బస్సు పాసులను అందిస్తున్నామని తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి అన్నారు. నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఆర్‌టిసి అధికారులు బస్సు పాసులు ఇవ్వగా వాటికి ఐడీ కార్డులకు బళ్ల త్రిమూర్తులు ఆర్థిక సాయం అందించారని ప్రధానోపాధ్యాయుడు నాగూర్ మీరా తెలిపారు. అనంతరం త్రిమూర్తులను ఆర్‌టిసి అధికారులు సత్కరించారు. మానవత మండలాధ్యక్షుడు వేగేశ్న రంగరాజు, సర్పంచి దిద్ల అలకనంద, ఎస్ఎంసి ఛైర్మన్ దిద్ల సంధ్యారాణి, ఆర్‌టిసి పాస్‌ల పిఆర్ఒ దొంతల విజయకుమార్, బొమ్మిడి అప్పారావు, సప్పా వీరబాబు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ముసునూరు

విజయవాడ వరద బాధితుల కోసం తమ వంతు సహాయంగా రూ.పది వేల చెక్కు సిఎం సహాయ నిధికి అందించినట్లు టిడిపి వేల్పుచర్ల గ్రామ నాయకులు గరికముక్కు నాని తెలిపారు. ఈ మేరకు చెక్కును శనివారం మంత్రి కొలుసు పార్థసారధికి అందించినట్లు చెప్పారు.

చింతలపూడి : విజయవాడ వరద బాధితులకు జనసేన చింతలపూడి నాయకులు సాయం అందించడం అభినందనీయమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. విజయవాడ వరద బాధితులకు జనసేన చింతలపూడి అధ్యక్షులు చిదరాల మధుబాబు ఆధ్వర్యంలో సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్షను ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌కు ఆయన క్యాంపు కార్యాలయంలో అందించారు.

గోగుంట సొసైటీ ద్వారా మెరుగైన సేవలు

పెదపాడు : సహకార సంఘం అభివృద్ధి, ఖాతాదారులకు మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తామని గోగుంట సొసైటీ ఇన్‌ఛార్జి మూర్తి తెలిపారు. గోగుంట సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి రూ.1.50 కోట్ల నికర లాభం వచ్చిందన్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు భావరాజు సత్యనారాయణ, మేడురి కుటుంబశాస్త్రి, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పలుచోట్ల వైసిపి శ్రేణుల పూజలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తిరుమల తిరుపతి లడ్డూ వివాదంపై సిబిఐతో గాని, సిట్టింగ్ జడ్జితో గాని విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆయన పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయప్రకాష్‌లతో కలిసి ఏలూరులోని రామచంద్రరావుపేటలోని వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం శ్రీ త్రిపుర సుందరి సమేత కామేశ్వరస్వామి వారి ఆలయంలో తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శనివారం పూజలు చేశారు.

కుక్కునూరు : మండలంలోని పలు పంచాయతీల పరిధిలోని ఆలయాల్లో వైసిపి శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుక్కునూరు పాత రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని శ్రీ వెంకటాచల స్వామి దేవాలయంలో మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

టి.నరసాపురం : వైసిపి మండల కన్వీనర్ ఎస్‌విపికెహెచ్.శ్రీనురాజు ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల నాయకులు వాసిరెడ్డి మధు మాట్లాడారు.

ముదినేపల్లి : మండలంలోని గురజలో ఉన్న గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయం, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో వైసిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెదపాడు : మండలంలోని అప్పనవీడులో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో వైసిపి నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

ప్రజాశక్తి - మండవల్లి

మహాకవి, అభ్యుదయవాది గుర్రం జాషువా నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ అన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలను పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శాంతరాజు, ఉపాధ్యక్షులు పాగోళ్ల అభిస కార్యదర్శి కొండపల్లి రవి వరప్రసాద్ ముఖ్య సలహాదారు గోరింక గాంధీ, కోట్ల విప్లవ ప్రసాద్, గుడివాడ గణేష్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి కల్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న ముగ్గురు ఫిట్టర్లు, ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లకు వార్డ్ ఎమినిటి సెక్రటరీస్‌గా ఉన్న పోస్టులను రద్దుచేసి నగరపాలక సంస్థలోనే ఉద్యోగోన్నతి కల్పించి పోస్టులు మంజూరు చేయాలని ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు కోరారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీలను శనివారం మున్సిపల్ కమిషనర్‌కు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు అందించినట్లు తెలిపారు.

నిడమర్రులో అన్న సమారాధన

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రులో బాల వెంకటేశ్వర స్వామిని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహిస్తున్న అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. యాత్రికులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.